ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 23 అక్టోబరు 2025



తుఫాన్ తప్పింది



రామేశ్వరం సమీపం పాంబన్ దీవి వద్ద నిలిచి ఉన్న పడవలు

● ఐదు జిల్లాలకు భారీ వర్ష సూచన ● డెల్టా జిల్లాల్లో నీటమునిగిన పంటలు ● చెన్నైని ముంచెత్తిన వర్షం

చెన్నైలో ...

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 11 గంటల నుండి భారీగా వర్షం కురిసింది. నగరంలోని కోయంబేడు, తాంబరం, వేళచ్చేరి, రాయపేట, ట్రిప్లికేన్, ప్యారీస్ కార్నర్, అడయార్ తదితర ప్రాంతాల్లో వేకువజాము 3 నుండి 5 గంటల వరకూ చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. బుధవారం వేకువజాము తిరువొత్తియూరు కుప్పం ప్రాంతంలో దేశరాణి (74) అనే వృద్ధురాలికి చెందిన ఇల్లు కూలిపడింది. ఈ సంఘటనలో దేశరాణి, ఆమె మనవడు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అగ్నిమాపక దళం ఇంటి శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని రక్షించారు.

215 సురక్షిత కేంద్రాలు...

భారీ వర్షాల కారణంగా నగరంలోని లోట్టు ప్రాంతాలో నివసిస్తున్న వారి కోసం నగరంలో 215 సురక్షిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో బసచేయనున్నవారికి మూడుపూటలా ఆహారం అందించడానికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో 106 వంటశాలలు కూడా సిద్ధం చేశారు. ప్రస్తుతం 63 వంటశాలల్లో ఆహారం తయారవుతున్నట్లు మేయర్ ఆర్ ప్రియా తెలిపారు.

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా మారే అవకాశాలు లేవని, గురువారం వాయుగుండంగానే అది తీరం దాటనుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా చెన్నై సహా ఐదు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో గురువారం భారీగా వర్షాలు కురిసే అవకాశముంది. ఇదే విధంగా ఈ నెల 24న కడలూరు, విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాల్లో భారీ వర్షాలు, ఈ నెల 26 నుండి 28 వరకు చెన్నై పరిసర జిల్లాలు, కడలూరు, కళ్ళకురిచ్చి జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం వుంది. వాయుగుండం కారణంగా తిరువళ్లూరు, రాణిపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో బుధవారం ఆ రెండు జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఇదే విధంగా చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, సేలం జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశాలుండటంతో ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేశారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా తిరువళ్లూరు, చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురం, తంజావూరు, తిరువారూరు, మైలాడుదురై, కళ్లకురిచ్చి, రాణిపేట, శివగంగ, కాంచీపురం జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. చెన్నై జిల్లాలో మాత్రం పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించారు.



పోరూరులో వర్షపునీటిని మోటారు పంపుతో తొలగిస్తున్న కార్పొరేషన్ కార్మికులు



చెన్నై శివార్లలో నీట మునిగిన ఇళ్లు

దక్షిణాది జిల్లాల్లో తడిసిన పంటలు...

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, ఈశాన్య రుతుపవనాల కారణంగా దక్షిణాది జిల్లాల్లో మూడు రోజులుగా కురిసిన భారీవర్షాలకు సుమారు లక్ష ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునిగింది. తిరువారూరు జిల్లాలో వర్షాలకు జలాశయాలన్నీ నీటితో నిండి ప్రవహించాయి. ఆ జిల్లాల్లో సుమారు 5 వేల ఎకరాల విస్తీర్ణంలో పదిరోజుల క్రితం వేసిన వరి నారుమళ్లు నీట మునిగాయి. ఇదే విధంగా తంజావూరు సమీపం కాట్టూరు, పాపనాశం, అమ్మాపేట ప్రాంతాల్లో సుమారు 10వేల ఎకరాల వరిపంట వరదనీటిలో కొట్టుకుపోయింది. మరో 25 ఎకరాల్లో ఇరవై రోజుల క్రితం వేసిన వరినాట్లు తడిసిముద్దయ్యాయి. నాగపట్టినం వేలూరు, వేదారణ్యం, తిరుక్కువలై ప్రాంతాల్లో 10 వేల ఎకరాలు, తిరుచ్చి జిల్లాలో 15 వేల ఎకరాల విస్తీర్ణంలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీట మునిగింది.

స్తంభించిన పుదుచ్చేరి

● వానలకు పడవలు, వలలు ధ్వంసం



ఇందిరా గాంధీ కూడలిలో నిలిచిన వరదనీరు

పుదుచ్చేరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. ఈ నెల 16న ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించడంతో పుదుచ్చేరి, కారైక్కాల్ జిల్లాల్లో మోస్తరు నుండి భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రధాన రహదారుల్లో చేరిన వరదనీటితో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇందిరా గాంధీ స్క్వేయర్ పుదుచ్చేరి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో మూడు రోజులుగా చేరిన వరదనీటిని మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. గరిష్టంగా కాలాపట్టిలో సుమారు 25సెంటీమీటర్ల మేరకు వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో చిన్నకాలాపట్టు జాలర్ల గ్రామంలో తీరంలోని 5 నాటు పడవలు, రూ.కోటి విలువచేసే వలలు అలల తాకిడి కారణంగా సముద్రంలోకి కొట్టుకుపోయాయని గంగపుత్రులు వాపోతున్నారు. వర్షాల కారణంగా కరోడికుప్పం ప్రాంతం లోని గణపతి ఆలయం ప్రాంగణంలోని తీర్థకొలును సుమారు 90శాతం నిండింది. దీంతో ఆ కొలను ప్రహరీ ఓ వైపు నేలకొరిగింది. వరదనీరు భారీస్థాయిలో చేరిన ప్రాంతాలను కాలాపట్టు బీజేపీ ఎమ్మెల్యే కల్యాణసుందరం పరిశీలించారు. ఆయన ప్రజాపనులశాఖ అధికారులకు ఫోన్ చేసి వరద సహాయక పనులను వెంటనే చేపట్టాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా గణపతిచెట్టికుళం రాజగోపాల్‌నగర్, యూన్సీనగర్ తదిత ర ప్రాంతాల్లో చేరిన వరదనీటిని, రహదారులపై విరిగిపడిన మట్టిచర్యలను తొలగించాలని, వరద నష్టాన్ని అంచనా వేసి బాధితుల కు తగిన సహాయం అందజేయాలని ఆయన ముఖ్యమంత్రి రంగస్వామికి విజ్ఞప్తిచేశారు.

యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి

● ఈపీఎస్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని మాజీముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం తంజావూరు, తిరువారూర్ ప్రాంతాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అక్కడున్న రైతులు ఆయనకు వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపించి, కొనుగోలు చేసిన దానికి నగదు చెల్లించలేదని, అందువల్ల పండుగపూట తమ కుటుంబాల్లో ఆనందం లేదని వాపోయారు. రైతుల సమస్యలను తెలుసుకున్న ఈపీఎస్.. వాటిని అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాక శాశ్వతంగా పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..దీపావళి పండుగ ముందు ధాన్యం కొనుగోలు చేయకుండా సుమారు 20 రోజులు జాప్యం చేశారని, రాష్ట్రంలో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మార్కెటింగ్ కమిటీలకు సరఫరా చేసిన ధాన్యం మొలకలెత్తి రైతులకు నష్టం చేకూర్చిందని, అయినా ఈ డీఎంకే మోడల్ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. తంజావూరు కాట్టూరులోని కొనుగోలు కేంద్రంలో పైకప్పులేని కారణంగా ధాన్యం మొలకలెత్తిందని, ఇందుకు కారణం సకాలంలో వ్యవసాయశాఖ అధికారులు స్పందించపోడమేనన్నారు. ఒక్క తంజావూరు జిల్లాలోనే సుమారు 18వేలకు పైగా ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులను అడిగితే సరైన సమాధానం లేదన్నారు. ధాన్యం ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం ధాన్యాన్ని కోనుగోలు చేయకుండా అన్నదాతలను మోసం చేసిందని, కేంద్రప్రభుత్వ ఆగస్టు 18వ తేదీ నుండి రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వానికి అనుమతులిచ్చిందని, అయినా ముఖ్యమంత్రి సహా మంత్రులు, సంబంధిత అధికారులు కుంటిసాకులు చెబుతూ, కాలయాపన చేస్తున్నారని ఈపీఎస్ మండిపడ్డారు. ఈపీఎస్‌తో పాటు మాజీమంత్రులు ఆర్.కామరాజ్, డా.విజయభాస్కర్ తదితరులు పరిశీలించారు.

ధాన్యం నిల్వలు పేరుకుపోవడానికి కేంద్రమే కారణం

● తంజావూరులో మంత్రి చక్రపాణి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి చక్రపాణి

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల నుండి సేకరించే ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో నూర్పిడి చేయడానికి కేంద్రం అనువైన సమయంలో అనుమతివ్వకపోవడం వల్లే రాష్ట్రమంతటా ధాన్యం బస్తాలు పెద్దసంఖ్యలో పేరుకుపోయాయని రాష్ట్ర ఆహారశాఖ మంత్రి చక్రపాణి పేర్కొన్నారు. తంజావూరు పిల్లయార్‌పట్టి మార్కెటింగ్ కమిటీని బుధవారం ఉదయం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్, బీసీ సంక్షేమశాఖ మంత్రి మెయ్యనాథన్‌తో కలిసి మంత్రి చక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ ఏడాది ఊహించని విధంగా ధాన్యం దిగుబడి వచ్చిందని, ఒక్క తంజావూరు జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 299 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.06లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేయాల్సివుందన్నారు. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే పెరిగిందని, ప్రతిరోజు 1,250 లారీల్లో పొరుగు జిల్లాలకు వరిధాన్యం బస్తాలను పంపిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు గూడ్స్ రైళ్ల ద్వారా పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల నుండి సేకరించే ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో ఆడించడానికి కేంద్రప్రభుత్వం సకాలంలో అనుమతించకపోవడం వలన ధాన్యం బస్తాల నిల్వలు మార్కెటింగ్ కమిటీల్లో పేరుకుపోయాయని మంత్రి వివరణ ఇచ్చారు.

వర్షబాధితులకు సాయం చేయండి

● డీఎంకే శ్రేణులకు ఉదయనిధి పిలుపు
● ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావం, బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా నగరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారిని డీఎంకే శ్రేణులు సాయం చేసి ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశం మేరకు ఏర్పాటైన పార్టీ నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, చెన్నై జిల్లా శాఖల నాయకుల సమావేశం బుధవారం ఉదయం అన్నా అరివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయని, చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయని, ఈ జిల్లాల్లో వర్షబాధితులను యుద్ధ ప్రాతిపదికన సాయం చేయాలన్నారు. జిల్లా శాఖల నాయకులు తమ ప్రాంతాల్లో వర్షాలకు కలిగిన నష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రభుత్వానికి వివరించాలని కోరారు. అదే సమయంలో జలదిగ్బంధంలో చిక్కుకున్నవారిని కాపాడేందుకు చర్యలు చేపట్టి, సురక్షిత శిబిరాలకు చేర్చి ఆహారం అందించాలని చెప్పారు. ప్రస్తుతానికి తుఫాన్ గండం తప్పినా నవంబర్, డిసెంబర్‌లో తుఫాన్లు సంభవిస్తాయని, కనుక ఇప్పటి నుండే పార్టీ శ్రేణులు వర్షాలకు, వరదలకు నష్టపోయే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సహాయక బృందాలుగా ఏర్పడి బాధితులను ఆదుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, నాజర్, దామో అన్బరసన్, ఎంపీలు కళానిధి వీరాసామి, తమిళచ్చి తంగపాండ్యన్, దయానిధి మారన్, కనిమొళి సోము, మేయర్లు ప్రియా (గ్రేటర్ చెన్నై), వసంత్‌కుమార్ (తాంబరం) ఉదయకుమార్ (ఆవడి) ఎమ్మెల్యేలు ఎళిలన్, ఇ. కరుణానిధి, ఎస్ఆర్ రాజా, జోసెఫ్ సామువేల్ మోహన్, ప్రభాకర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



చింతాద్రిపేట కార్పొరేషన్ స్కూలులో వర్షబాధితుల శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి

వేకువజాము నుంచే తనిఖీలు..

నగరంలో వర్షాలకు నష్టపోయిన ప్రాంతాల్లో సహాయక చర్యలను ఉపముఖ్యమంత్రి ఉదయనిధి బుధవారం వేకువజామునే అధికారులతో కలిసి తనిఖీ చేశారు. వర్షబాధితుల సహాయం కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు వెళ్ళి నగరం నలుమూలల నుండి వర్షబాధితులు చేసిన ఫోన్‌కాల్స్ విని, వారికి అవసరమైన సహాయం తెలుసుకుని, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ట్రిప్లికేన్ వెంకటరంగం వీధిలోని సామాజిక కేంద్రానికి వెళ్ళి వర్షబాధితుల ఆహారం కోసం ఏర్పాటవుతున్న వంటశాలలను తనిఖీ చేశారు. అక్కడి నుండి చింతాద్రిపేట అయ్యావీధిలో ఏర్పాటు చేసిన భారీ వంటశాలను తనిఖీ చేశారు. అన్నాసాలై జనరల్ పేటర్స్ రోడ్డులో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించారు. నగరంలోని 22 సొరంగ మార్గాల్లో వర్షపునీరు నిలువకుండా చేపట్టాల్సిన చర్యలు గురించి అధికారులతో సమీక్ష జరిపారు. వేకువజాము రెండు గంటల నుండి ఉదయం తొమ్మిది గంటల దాకా ఉదయనిధి ఈ తనిఖీలు నిర్వహించారు.

శ్రీపురంలో విశేష దీపారాధన

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని అరియలూరులో ప్రసిద్ధి చెందిన నారాయణి ఆలయంలో ప్రపంచ శాంతి కోసం 10,008 దీపాలను శ్రీచక్ర ఆకారంలో తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి 8గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ పీఠాధిపతి శక్తిఅమ్మ మాట్లాడుతూ, ప్రపంచశాంతి కోసం, రాష్ట్రంలోని రైతుల కష్టాలు తొలిగేలా అమ్మవారికి ఈ విభిన్నమైన పూజ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారికి దీపాలు వెలిగించి ప్రార్థించారు.

శ్రీచక్రం ఆకారంలో వెలిగించిన దీపాలు



మెరీనాను ముంచెత్తిన నురగ

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా మెరీనా బీచ్‌లో విచిత్ర దృశ్యం ఆవిష్కృతమైంది. మేఘాలను తలపించేలా తీరం మొత్తం నురగ కమ్మేసింది. దీంతో మత్స్యశాఖ, జలవనరుల శాఖాధికారులు నిపుణులతో వచ్చి ఈ నురగను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి సముద్రంలో చేరుతున్న కొత్తనీరు, కొన్ని ఫ్యాక్టరీల నుంచి వెలువడిన కాలుష్యర మిళితమై ఇలా నురగ వచ్చిందని తెలిపారు. దీనివల్ల స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.





సమాచార ధ్వని

27 వరకు బీఎడ్ రుసుము చెల్లించేందుకు అవకాశం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీఎడ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు అర్హత రుసుము చెల్లించేందుకు ఈ నెల 27వ తేది వరకు అవకాశం కల్పించారు. ఈ విషయమై తమిళనాడు ఉపాధ్యాయ విద్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ (ఇన్‌ఛార్జ్) కె.రాజశేఖరన్ విడుదల చేసిన ప్రకటనలో... 2025-26 విద్యా సంవత్సరంలో బీఎడ్, బీఎడ్ (ప్రత్యేక విద్య) కోర్సుల్లో చేరిన విద్యార్థులు అర్హత రుసుము ఆన్‌లైన్ చెల్లింపు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ తదితరాలకు ఈ నెల 27వ తేదిలోపు అవకాశం కల్పించారు. ఆపై ఎలాంటి గడువు పొడిగించే అవకాశం లేదని, సర్టిఫికెట్ల పరిశీలన తేది త్వరలో ప్రకటిస్తామని రిజిస్ట్రార్ ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్‌లో 'స్పోకెన్ జపాన్' కోర్సు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత్-జపాన్ పరిశ్రమలు, వాణిజ్య మండలి ఆధ్వర్యంలో, ఆన్‌లైన్‌లో జపాన్ భాషపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు తేనాంపేటలోని భారత్-జపాన్ పరిశ్రమలు, వాణిజ్య మండలి ప్రధాన కార్యదర్శి సుగుణ రామమూర్తి విడుదల చేసిన ప్రకటనలో... ఆన్‌లైన్ శిక్షణలో జపాన్ భాష మాట్లాడడం, రాయడంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఆన్‌లైన్ కోర్సు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. కోర్సులో చేరే వారికి జపాన్ భాష మాత్రమే కాకుండా, జపాన్ కళలు, సంస్కృతి, వ్యాపార విధానం తదితరాలు వివరించనున్నారు. నవంబరు 2 నుంచి ప్రారంభం కానున్న ఈ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9884394717 అనే నెంబరు, www.ijcci.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

వర్షాలతో తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల వర్షాలు ప్రారంభం కావడంతో రోజువారీ విద్యుత్ వినియోగం 11వేల మెగావాట్లకు తగ్గింది. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 16వేల మెగావాట్లు కాగా, వేసవిలో 20వేల మెగావాట్లకు చేరుకుంటుంది.ఈనేపథ్యంలో, రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ వినియోగం తగ్గింది. ఆ ప్రకారం, ఈ నెల 19వ తేది 12,557 మెగావాట్లు, 20వ తేది దీపావళి రోజున 10,923 మెగావాట్ల వినియోగం నమోదైంది. అలాగే, దీపావళి సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, కర్మాగారాలకు మూడు రోజులు సెలవులు రావడంతో విద్యుత్ వినియోగం తగ్గిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

'సీమాట్'కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉన్నత విద్యా సంస్థలు, అఖిల భారత సాంకేతిక విశ్వవిద్యాలయాల మండలి (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో పనిచేస్తున్న కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోర్సు (ఎంబీఏ)లో చేరేందుకు 'సీమాట్' అనే జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఆ ప్రకారం, ఈ ఏడాది అర్హత పరీక్ష జనవరిలో నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఆసక్తి కలిగిన పట్టభద్రులు నవంబరు 17వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. పరీక్షా రుసుము చెల్లించేందుకు నవంబరు 18వ తేది చివరి రోజుగా ఉంది. మరిన్ని వివరాలకు 011-40759000 అనే నెంబరు, ఈ-మెయిల్ చిరునామాలో సంప్రదించవచ్చు.

'పీఎం యశస్వి' స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'పీఎం యశస్వి' పథకంలో ఉపకార వేతనం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విషయమై బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ డైరెక్టరేట్ జిల్లా కార్యాలయాలకు పంపిన ఉత్తర్వులో వివరాలిలా... 'పీఎం యశస్వి' పథకంలో జాబితాలో ఉన్న పాఠశాలల్లో, 9,11 తరగతుల ఓబీసీ, ఈబీసీ, టీఎన్‌టీ విభాగాల విద్యార్థులకు ప్రతి ఏడాది రూ.4 వేలు స్కాలర్‌షిప్ అందజేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్కాలర్ షిప్ పొందేందుకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 31వ తేది వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు https://scholarships.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఈ పథకంలో దరఖాస్తు చేసుకునే విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలుగా ఉండాలని సర్క్యులర్‌లో తెలిపారు.

గ్రూప్-4 ఫలితాలు విడుదల

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పరీక్షా ఫలితాలను టీఎన్‌పీఎస్సీ బుధవారం విడుదల చేసింది. గ్రామ పరిపాలనాధికారి, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్, ఫారెస్ట్ గార్డ్ సహా 3,935 ఖాళీ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ఏప్రిల్‌లో తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) విడుదల చేసింది. జూన్ 12వ తేది నిర్వహించిన రాతపరీక్షకు 11.48 లక్షల మంది హాజరయ్యారు. ఖాళీ పోస్టుల సంఖ్య పెంచుతామని టీఎన్‌పీఎస్సీ ఛైర్మెన్ ఎస్కే ప్రభాకర్ తెలిపారు. ఆ ప్రకారం, సెప్టెంబరు చివరి వారంలో అదనంగా 727 పోస్టులు పెంచగా, మొత్తం భర్తీకానున్న పోస్టుల సంఖ్య 4,662కు పెరిగింది. జూన్ 12వ తేది నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలు https://tnpsc.gov.in/ అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. అనంతరం కటాఫ్ మార్కుల ఆధారంగా ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడానికి ఎంపిక చేయబడిన వారి జాబితాను వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు నిర్దిష్ట కాలంలో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అనంతరం ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ కోసం కాల్ లెటర్స్ పంపనున్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

● రుతుపవనాల ఎఫెక్ట్...

గర్భిణులు, రోగులను ఆస్పత్రుల్లో చేర్చండి

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో, ప్రమాదస్థితిలో ఉన్న రోగులు, ప్రసవం తేది దగ్గరపడుతున్న గర్భిణులను ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రులు, వైద్య కళాశాల ఆస్పత్రుల్లో చేర్పించాలని ఆరోగ్య శాఖ సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో భారీవర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ప్రవేశించగా, పలు ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, ఆరోగ్య శాఖ డైరెక్టర్ సోమసుందరం, అన్ని జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులకు పంపిన ఉత్తర్వులో... రుతుపవనాలు, తుఫానుల సమయాల్లో ప్రజలకు భద్రత కల్పించేలా, ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీల్లో వరద నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు, ప్రసవ తేది దగ్గర పడిన గర్భిణులను గుర్తించి, ముందుగా ఆస్పత్రుల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ డైరెక్టర్ తెలిపారు.

వరద ప్రాంతాల్లో జీసీసీ అల్పాహారం పంపిణీ


ప్రజలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న మేయర్ ప్రియ

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా నగరంలో వరదనీరు నిలిచిన లోతట్టు ప్రాంతాల్లో లక్షా 46వేల 950 మందికి అల్పాహారం పంపిణీ చేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ఆర్.ప్రియ తెలిపారు. బుధవారం ఉదయం ఆమె మీడియాతో మాట్లాడుతూ, నగరంలోని 15 జోన్లలో వరదప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల కోసం జీసీసీ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిందని, కంట్రోల్ రూంకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈశాన్య రుతుపవనాలు కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల రహదారుల్లో చేరిన నీటిని తొలగించేందుకు ఇంజనీర్లు, సిబ్బంది, పారిశుధ్య కారికులు సహా దాదాపు 20వేల మందికి పైగా విధుల్లో పాల్గొంటున్నట్లు మేయర్ తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 215 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి వాటిలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఆహారం పంపిణీ చేసేందుకు 106 వంట తయారీకేంద్రాలు పనిచేస్తున్నాయని, వర్షం తగ్గేవరకు బాధిత ప్రాంతాల్లో ఆహారం పంపిణీ కొనసాగుతుందని మేయర్ తెలిపారు.

ప్రజా గ్రీవెన్స్‌కు వినతులు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 9 వినతులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం, సమస్యలను విచారించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

శ్రీవిల్లిపుత్తూర్‌లో రూ.10 కోట్ల పాలకోవా విక్రయం



పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా శ్రీవిల్లిపుత్తూర్‌లో రూ.10 కోట్ల మేర పాలకోవా విక్రయాలు జరిగాయి. విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ పాలకోవా ఎంతో ప్రసిద్ధిచెందింది. ఈ ప్రాంతంలో సుమారు 500లకు పైగా పాలకోవా తయారీ కేంద్రాలున్నాయి. ఈ పాలకోవాకు భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. దీపావళి పండుగ సందర్భంగా పొరుగు రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా ఆర్డర్లు వచ్చాయి. దీపావళి సందర్భంగా కొత్త రకాల పాలకోవాలు తయారుచేశారు. దీపావళి సందర్భంగా మూడు రోజుల్లో సుమారు రూ.10 కోట్ల మేర పాలకోవా విక్రయించినట్లు శ్రీవిల్లిపుత్తూర్ పాలకోవా ఎగుమతిదారుడు తిరుపతి రాజ్ తెలిపారు.


'తిరువళ్లూరు'ను వదలని వాన


పూండి జలాశయం నుంచి విడుదలవుతున్న జలాలు

ప్యారీస్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చురుకుగా ఉన్న ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో పలు జిల్లాల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు చెరువులు, జలాశయాలు, వాగులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. ఈ క్రమంలో తిరువళ్లూరు జిల్లాలో మంగళవారం నుండి బుధవారం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. పండుగ సీజన్‌లో జిల్లావాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. కాగా, జిల్లాలో మొత్తం 75.65 మిల్లీమీటర్ల వర్షంకురిసింది. జిల్లాలోని పూండి సత్యమూర్తి, పుళల్, షోళవరం తదితర జలాశయాల్లో నీటిమట్టం పూర్తిస్థాయిలో పెరుగుతున్న కారణంగా ముందస్తు చర్యల కింద మిగుల జలాలను ప్రధాన కాలువల్లో విడుదల చేస్తున్నారు. ఇదిలా వుండగా, భారీవర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ శాఖ హెచ్చరికలతో తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు.

ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించండి

● అధికారులకు ఎంపీ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కదిర్ ఆనంద్ తదితరులు

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సకాలంలో స్పందించాలని, ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా అధికారులు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎంపీ కదిర్ ఆనంద్ సూచించారు. వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు కార్తికేయన్, అమ్ములు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, జిల్లా అటవీశాఖ అధికారి అశోక్‌కుమార్, డీఆర్వో మాలతి, అధికారులు కాంచన తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన


అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వేలూరు జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, నదులు సహా పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం కలెక్టర్ సుబ్బులక్ష్మి అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ బాలల హాస్టళ్లలో పిల్లలకు అందిస్తున్న అల్పాహారాన్ని ఆమె పరిశీలించి విద్యార్థులను ఆహారనాణ్యత తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేలూరు కార్పొరేషన్ కమిషనర్ లక్ష్మణన్, అధికారి శరవణన్ సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు కూలి తల్లీకూతుళ్ల దుర్మరణం


మృతులు అసోదై, జయా (ఫైల్‌ఫొటో)


మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా అండార్‌ముల్లిపల్లమ్ ప్రాంతంలో భారీ వర్షాలకు బుధవారం ఉదయం ఇంటి పైకప్పు కూలి పడటంతో తల్లి, కుమార్తె మృతి చెందారు. ఆ ప్రాంతంలోని ఓ ఇంటిలో మణి, యసోదై (69)అనే వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వీరికి జయా (40) అనే కుమార్తె ఉంది. మంగళవారం రాత్రంతా కురిసిన భారీ వర్షానికి ఆ ఇంటిపైకప్పు పూర్తిగా నానింది. బుధవారం ఉదయం ఉన్నట్టుండి పైకప్పు కూలిపడటంతో దాని శిథిలాల కింద నలిగి తల్లీకూతుళ్లు దుర్మరణం చెందారు. ఈ సమాచారం తెలియగానే వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్ సెల్వం ఆ ప్రాంతానికి వెళ్ళి కూలిపడిన ఇంటిని పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భారీ వర్షాలు... నిండిన జలవనరులు


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, అధికారులు

వేలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు, తిరుపత్తూరు జిల్లాల్లో గడిచిన మూడు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తుండటంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీపంలోని ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతంలోవున్న పుల్లూరు చెక్‌డ్యాంలో వరద ఉధృతి అధికమైంది. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రంలోని బేల్‌మంగళం చెరువు, ఆంధ్రాలోని పాలూరు చెక్‌డ్యాంలో వరద ఉధృతి ఎక్కువకావడంతో అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో తిరుపత్తూరు, రాణిపేట, వేలూరు సహా పలు ప్రాంతాల్లోని నదులు, చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. వేలూరులోని ముత్తుమండపం, ముల్లైనగర్, ఇందిరానగర్, జేజే నగర్ తదితర ప్రాంతాల్లో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో నదీపరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం అనైకట్టులోని పునరావాస కేంద్రానికి ఎమెల్యే నందకుమార్ చేరుకుని ప్రజలకు ఆహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు బాబు, డీఎంకే నిర్వాహకులు ప్రకాష్, భాస్కరన్, గణపతి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వేలూరులోని ఓ వీధిలో చేరిన వర్షపు నీరు

అసెంబ్లీ ఎన్నికలు.. భీకర యుద్ధమే

ఎంఎన్ఎం నేత స్నేహన్


తిరుచెందూరు ఆలయం వద్ద స్నేహన్, ఆయన సతీమణి

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడానికి ముందే ప్రధాన పార్టీలు ప్రచారం చేయడాన్ని చూస్తుంటే వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలు భీకరయుద్ధాన్ని తలపించేలా జరగటం ఖాయమని ప్రముఖ సినీ గేయరచయిత, ఎంఎన్ఎం నేత స్నేహన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా తిరుచెందూరు ఆలయాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకూ జరిగిన అసెంబ్లీ ఎన్నికలకంటే వచ్చే యేడాది జరిగే ఎన్నికలే వైవిధ్య భరితంగా ఉంటాయని తెలిపారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల లేదా రెండు నెలల ముందు ప్రధాన పార్టీలు ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీ, ప్రస్తుతం ఓ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసిందని, మరో ప్రధాన పార్టీ ఎన్నికలకు పది నెలలకు ముందే జాతీయ పార్టీతో పొత్తు ఖరారు చేసుకుని నియోజకవర్గాల వారీగా ప్రచారం ప్రారంభించిందని, వీటన్నింటిని పరిశీలిస్తే వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు భీకరయుద్ధంలా రసవత్తరంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు.

'సెంట్రల్'లో బుక్ వెండింగ్ మెషిన్‌కు ఆదరణ


మెషిన్ నుంచి పుస్తకం కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ బుక్ వెండింగ్ మెషీన్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ విషయమై చెన్నై మండల రైల్వే అధికారులు మాట్లాడుతూ... ప్రయాణికుల్లో, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా, సెంట్రల్ రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలో ఆటోమేటిక్ బుక్ వెండింగ్ మెషీన్‌ను ఈ నెల 10వ తేది ప్రారంభించామన్నారు. నవలలు, బాల సాహిత్యం సహా పలురకాల పుస్తకాలు ఉంచామన్నారు. ప్రయాణికులు తమకు ఇష్టమైన పుస్తకం ఎంపిక చేసుకుని, దాని ధర చెల్లించి మెషీన్ నుంచి పుస్తకం పొందవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. చెన్నై మండల పరిధిలోని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో ఆటోమేటిక్ బుక్ వెండింగ్ మెషీన్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

వర్షాల కారణంగా తగ్గిన పూల ధరలు

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా కోయంబేడు మార్కెట్లో పూల ధరలు తగ్గాయి. సోమవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీవర్షాల కారణంగా పొరుగు జిల్లాల నుంచి కోయంబేడు మార్కెట్‌కు తక్కువగా పూలు దిగుమతయ్యాయి. అదే సమయంలో నగరం, శివారు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా చిల్లర, హోల్‌సేల్ వ్యాపారులు తక్కువగానే మార్కెట్‌కు వచ్చారు. వ్యాపారాలు లేక పూల ధరలు తగ్గాయి. ఆ ప్రకారం, కిలో మల్లెలు రూ.900 నుంచి రూ.400కి తగ్గాయి, ఐస్ మల్లెలు రూ.600 నుంచి రూ.300, జాజిమల్లె రూ.400 నుంచి రూ.300, కనకాంబరాలు రూ.200 నుంచి రూ.140, సంపంగి రూ.80 నుంచి రూ.20, పన్నీర్‌రోజ్ రూ.140 నుంచి రూ.60, చాక్లెట్ రోజ్ రూ.100 నుంచి రూ.80కి తగ్గినట్లు కోయంబేడు పూల మార్కెట్ ఉపాధ్యక్షులు ముత్తురాజ్ తెలిపారు.

మూడు రెట్లు పెరిగిన కూరగాయల ధరలు...

కోయంబేడు మార్కెట్లో కూరగాయల ధరలు మూడు రెట్లుపెరిగాయి. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతులు తగ్గడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ మార్కెట్‌కు కర్ణాటక, ఆంధ్ర, కేరళ, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతవుతుంటాయి. కొద్దిరోజులుగా ఆయా రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కాయగూరల దిగుబడులు తగ్గాయి.ఈకారణంగా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ఆ ప్రకారం... ఉల్లి కిలో రూ.18 నుంచి రూ.25, చిన్న ఉల్లి రూ.25 నుంచి రూ.50, టమోటా రూ.15 నుంచి రూ.50, బంగాళాదుంపలు రూ.18 నుంచి రూ.30, క్యారెట్ రూ.10 నుంచి రూ.50, బీన్స్ రూ.35 నుంచి రూ.90కి విక్రయమవుతున్నాయి. అల్లం రూ.75 నుంచి రూ.100, వెల్లుల్లి రూ.50 నుంచి రూ.100కు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు.

మద్యం తాగనివ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగనీయకుండా కూతురు అడ్డుకుందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కన్నియాకుమారిలో చోటుచేసుకుంది. ముంగిల్‌విలైలో నివసిస్తున్న భవన నిర్మాణ కార్మికుడు రాజేంద్రన్ (49)కు అఖిల (47) అనే భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యం అలవాటు ఉన్న రాజేంద్రన్, ప్రతిరోజు రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడుతుంటాడని సమాచారం. ఘటన జరిగిన రోజున రాజేంద్రన్, తాను తీసుకొచ్చిన మద్యం బాటిల్ బీరువాలో దాచాడు. గమనించిన కుమార్తె బాటిల్ తీసుకొని బయటకు వచ్చి రాజేంద్రన్ కళ్ల ముందే మద్యం కిందపోసింది. దీంతో, ఆగ్రహించిన రాజేంద్రన్, ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. దిగ్భ్రాంతి చెందిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఆచారిపల్లం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స ఫలించక రాజేంద్రన్ మృతిచెందాడు. ఈ ఘటనపై మనవాలకుర్చి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అప్పుల బాధకు కుటుంబం బలి

భార్య, ఇద్దరు కుమారులను హతమార్చి వ్యాపారి ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక భార్య, ఇద్దరు కుమారులను హతమార్చిన వ్యాపారి.. తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. ఈసీఆర్ రోడ్డు ఇంజంబాక్కంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చిరంజీవి దామోదర గుప్తా (56) నివసిస్తున్నాడు. ఆయనకు రేవతి అనే భార్య, రిత్విక్ (11), అశ్వత్ (15) అనే కుమారులున్నారు. చిరంజీవి మౌంట్ రోడ్డులో ఎలక్ట్రానిక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారం కోసం పలువురి నుంచి అప్పు తీసుకున్నాడు. ప్రస్తుతం అప్పులు చెల్లించ లేని పరిస్థితిలో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో, అప్పుల బాధ తట్టుకోలేని చిరంజీవి, మంగవారం రాత్రి, కుమారుల ముఖాలకు ప్లాస్టిక్ కవర్లు చుట్టి ఊపిరాడకుండా చేశాడు. భార్యను కూడా అలాగే హతమార్చి, అనంతరం తానూ గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ మరణాలకు ఎవరూ బాధ్యులు కాదంటూ ఓ లేఖ రాసిపెట్టాడు. అందులో ఆయన భార్య సంతకం కూడా వుంది. తమ మృతి విషయాన్ని తన సోదరులకు సమాచారం తెలిపాలని కోరుతూ వారి సెల్‌ఫోన్ నెంబర్లు కూడా లేఖలో రాశాడు. సమాచారం అందుకున్న నీలాంగరై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, చిరంజీవి రాసిన సూసైట్ నోట్ స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

ఇంటి ప్రహరీ కూలి విద్యార్థిని మృతి


మృతురాలు భవాని (ఫైల్ ఫొటో)

పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రహరీ గోడ కూలి నర్సింగ్ విద్యార్థిని మృతిచెందిన ఘటన విరుదునగర్ జిల్లాలో చోటుచేసుకుంది. పాత వెల్లయాపురానికి చెందిన వీరమణి కుమార్తె భవాని (17) శివకాశిలోని ఓ నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో, ఈ నెల 18న వీరమణి తన భార్య రాధతో కలసి తన మట్టిల్లు శుభ్రం చేస్తుండగా ఇంటి బయట భవాని కూర్చుంది. ఈ ప్రాంతంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇంటి గోడ నాని కిందపడగా, గోడ శిథిలాల కింద భవాని చిక్కుకుంది. తల్లితండ్రులు, చుట్టుపక్కల వారు శిథిలాల నుంచి ఆమెను బయటకు తీసి మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక మంగళవారం భవాని మృతిచెందింది. ఈ ఘటనపై తిరుత్తంగల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

భారీ వర్షానికి కూలిపడిన ఆలయ గోపురం


భారీ వర్షానికి ధ్వంసమైన చెల్లియమ్మన్ అండవర్ ఆలయ గోపురం

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా దిట్టకుడి ప్రాంతంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ ప్రాంతంలోని చెల్లియమ్మన్ అండవర్ ఆలయ గోపురం విరిగి పడింది. బుధవారం వేకువజాము మూడు గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి ఆలయ గోపురం పైభాగం ముక్కలై నేలపై పడింది. స్థానికులు ఆలయ గోపురం కూలినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. హిందూ దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని మరమ్మత్తు చేసి కుంభాభిషేకం జరపాలని స్థానికులు డిమాండ్ చేశారు.

కోవైలో డివైడర్‌ను ఢీకొన్న బస్సు



డివైడర్‌ను ఢీకొని ధ్వంసమైన కాలేజీ బస్సు

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం నీలంపూర్ ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు కాలేజీ బస్సు బుధవారం ఉదయం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొనటంతో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఐదుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాఇ. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఊటీ కొండరైలు మార్గంలో బండరాళ్ల తొలగింపు


ఊటీ కొండరైలు మార్గంలో బాంబులతో బండరాయిని బద్దలు గొడుతున్న దృశ్యం

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా పట్టాలపై మట్టిపెళ్లలు, బండరాళ్లు కూలిపడటంతో నాలుగు రోజులుగా ఊటీ కొండరైలు సర్వీసును అధికారులు రద్దు చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో మేట్టుపాళయం - ఊటీ కొండ రైలు మార్గంలోని అటర్లీ - హిల్‌గ్రోవ్ రైల్వేస్టేషన్ మధ్య 10 ప్రాంతాల్లో పెద్దపెద్ద బండరాళ్లు పడ్డాయి. వాటిని తొలగించేందుకు రైల్వే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించినా తొలగించలేకపోయారు. దీనితో రైల్వే అధికారులు బుధవారం ఉదయం ఆ బండరాళ్లను తొలగించేందుకు బాంబులను ఉపయోగించారు. క్వారీలో ఉపయోగించే జెలిటిన్ సిక్స్‌తో వాడి బండరాళ్లను పేల్చారువివన్నీ గురువారం మధ్యాహ్నం వరకూ జరుగుతుందని, ఆ తర్వాత ఊటీ కొండ రైలు సర్వీసును పునరుద్ధరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

తిరుత్తణిలో ప్రారంభమైన స్కందషష్ఠి వేడుకలు

● మూడు టన్నుల పుష్పాలతో మురుగన్‌కు పూజలు


పుష్పాలంకరణలో వళ్లీ,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

తిరుత్తణి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో బుధవారం స్కందషష్ఠి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి 28వ తేదీ మంగళవారం వరకు జరగనున్న ఈ వైభవంలో స్వామివారికి ప్రతిరోజూ ఉదయం లక్షార్చన, సాయంత్రం 5 గంటలకు పుష్పాంజలి, దీపారాధన అర్చకులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, తొలిరోజైన బుధవారం స్వామివారిని 3టన్నుల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, 24వ తేదీ శుక్రవారం బంగారు కవచం అలంకారం, చివరిరోజైన 28వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు వళ్లీ, దేవసేన సమేత మురుగపెరుమాళ్ తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

హన్సికా మొత్వానీకి పేరు కష్టాలు!



హీరోయిన్ హన్సికా మొత్వానీకి కష్టాలు వెంటాడుతున్నాయి. దీంతో తన పేరును సంఖ్యా శాస్త్రం ప్రకారం మార్చుకున్నారు. అంటే తన పేరులోని ఆంగ్ల అక్షరాల్లో అదనంగా మరో 'ఎన్' చేర్చుకున్నారు. ఒకపుడు కోలీవుడ్‌లో చిన్న ఖుష్బూగా అభిమానులు పిలుచుకునే హన్సికాకు గత కొన్నేళ్ళుగా బ్యాడ్ టైమ్ కొనసాగుతోంది. ఆమె నటించిన పలు తమిళ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఆమెకు కోలీవుడ్‌లో అవకాశాలు సన్నగిల్లాయి. అదేసమయంలో తన స్నేహితుడిని వివాహం చేసుకుని చివరకు విడాకులు కూడా తీసుకున్నారు. దీనికితోడు కుటుంబ సమస్యలు కూడా చుట్టుముట్టాయి. ఈ నేపథ్యంలో జ్యోతిష్యం, దైవచింతన, పరిహారపూజలపై అధిక శ్రద్ధ చూపిస్తున్నారు. అలాగే, తన పేరులో సంఖ్యా శాస్త్రం ప్రకారం అదనంగా మరో 'ఎన్' చేర్చారు. తద్వారా తన కష్టాలు తీరి తలరాత (ఫేట్) మారుతుందని ఆమె బలంగా నమ్ముతున్నారు. కాగా, ఆమె తన పేరు మార్చుకోవడం ఇది రెండోసారి. గతంలో హన్సికా అనే పేరుతో నటించిన ఆమె ఆ తర్వాత హన్సికా మొత్వానీగా మార్చుకున్నారు. ఇపుడు హన్సికా ఆంగ్ల అక్షరాల్లో అదనంగా 'ఎన్' అనే అక్షరాన్ని చేర్చుకున్నారు.

డ్యూడ్.. కొత్త చర్చకు తెరలేపింది

చిత్రజ్యోతి

● ప్రదీప్ రంగనాథన్



'డ్యూడ్' సక్సెస్ మీట్‌లో చిత్ర బృందం

'డ్యూడ్' రూపంలో ఒక యూనివర్శల్ విజయాన్ని అందించిన డెబ్యూ డైరెక్టర్ కీర్తీశ్వరన్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని, ఈ చిత్రం ఒక సరికొత్త చర్చకు తెరలేపిందని దర్శక నటుడు ప్రదీప్ రంగనాథన్ అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తమిళం, తెలుగు భాషల్లో నిర్మించిన చిత్రం 'డ్యూడ్' ఈ నెల 17న విడుదలై ఘన విజయం సాధించింది. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.95 కోట్ల మేర వసూళ్ల సాధించి రూ.100 కోట్ల కలెక్షన్ల దిశగా దూసుకెళుతోంది. ప్రదీప్ రంగనాథన్‌కు హీరోగా హ్యాట్రిక్ విజయం. ఈ నేపథ్యంలో చిత్రబృందం బుధవారం నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఇందులో నిర్మాతలు నవీన్, రవిశంకర్ మాట్లాడుతూ, 'మా బ్యానరులో ఇప్పటివరకు వచ్చిన చిత్రాలకంటే డిఫరెంట్ చిత్రాన్ని అందించిన యువ దర్శకుడు కీర్తీశ్వరన్‌కు, ఈ సినిమా ఎంజాయ్ చేస్తూ ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇది మాకు తమిళంలో తొలి చిత్ర విజయం. చాలా ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ, 'కథ విన్న మరుక్షణమే ఈ సినిమా చేయాలని నిర్మాతలు నిర్ణయం తీసుకున్నారు. కొత్త దర్శకుడనే చిన్నచూపు చూడకుండా నా కంటూ ప్రత్యేకస్థానం ఇచ్చి, కంఫర్ట్ జోన్‌లో ఉంచిన దర్శకులకు కృతజ్ఞతలు. హీరో ప్రదీప్ మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు నేను నటించిన చిత్రాలు ఒక ఎత్తయితే, 'డ్యూడ్' మరో ఎత్తు. ఇలాంటి మంచి చిత్రాన్ని ఇచ్చిన దర్శకుడికి బిగ్ థ్యాంక్స్'. ఇది యూనివర్శల్ విజయం. ఈ చిత్రంతో తెలుగు, కన్నడం, మలయాళం భాషల్లో నాకు అభిమానులు వచ్చారు. ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ సినిమా స్టోరీపై కొందరికి భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. కానీ, సినిమాను మూడునాలుగు సార్లు చూస్తే ఖచ్చితంగా నచ్చుతుంది. ఇది ఒక మళ్ళీమళ్ళీ చూడాలనిపించే మూవీ' అన్నారు. హీరోయిన్ మమితా బైజు మాట్లాడుతూ, 'తమిళంలో నాకు తొలి సక్సెస్ మీట్. ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీనియర్ నటుడు శరత్ కుమార్ మాట్లాడుతూ, 'ఈ చిత్రం వంద రోజుల విజయోత్సవ వేడుకలను జరుపుకోవాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. సీనియర్ నటి రోహిణి మాట్లాడుతూ, 'మైత్రీ మూవీ మేకర్స్ బ్యానరులో ఇది నాకు మూడో సినిమా. అయితే, ఇప్పటివరకు తెలుగు సినిమాల సక్సెస్ మీట్‌లోనే పాల్గొన్నాను. చాలా రోజుల తర్వాత తమిళ సినిమా సక్సెస్ మీట్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది' అన్నారు.

'ద్రౌపది-2'లో రిచర్డ్ రిషి లుక్ రిలీజ్



నటుడు రిచర్డ్ రిషి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన నటిస్తున్న 'ద్రౌపది-2' మూవీ నుంచి ఓ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. నేతాజీ ప్రొడక్షన్స్ పతాకంపై చోళ చక్రవర్తి, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్‌తో కలిసి తమిళం, తెలుగు భాషల్లో ఈ మూవీని రూపొందించారు. దక్షిణ భారతదేశ సినీ చరిత్రలోనే శక్తిసామర్థ్యాలు, సంస్కృతి సంప్రదాయాలు, న్యాయాన్ని ప్రస్తావించనుంది. చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మూవీని డిసెంబరులో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు మోహన్ వివరిస్తూ 'చిత్రీకరణ తుదిదశ పనులు సాగుతున్నాయి. ప్రమోషన్ త్వరలోనే ప్రారంభిస్తాం' అని వెల్లడించారు.

మీ కృషి, వ్యక్తిత్వం అద్భుతం

● మారికి రజనీ ప్రశంసలు

'బైసన్' దర్శకుడు మారి సెల్వరాజ్‌పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసల వర్షం కురిపించారు. 'మీ కృషి, ప్రతిభ, వ్యక్తిత్వం ఆశ్చర్యం కలిగిస్తుంది' అంటూ కితాబిచ్చారు. ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్, రజీషా విజయన్ జంటగా మారి సెల్వరాజ్ తెరకెక్కించిన 'బైసన్' ఈ నెల 17వ తేదీ విడుదలై విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్, నిర్మాత పా.రంజిత్‌లను రజనీకాంత్ ప్రత్యేకంగా అభినందించారు. రజనీ ప్రశంసించిన విషయాన్ని మారి సెల్వరాజ్ ఎక్స్ వేదికలో వెల్లడించారు. 'సూపర్ మారి.. సూపర్. 'బైసన్' సినిమా చూశాను. ప్రతి చిత్రంలో మీ కష్టం, మీ వ్యక్తిత్వం ఆశ్చర్యం కలిగిస్తుంది. అభినందనలు మారి సెల్వరాజ్ అని తెలిపారు. గతంలో తాను దర్శకత్వం వహించిన 'పరియేరుమ్ పెరుమాళ్', 'కర్ణన్', 'మామన్నన్', 'వాళై' సినిమాలు చూసి ఏ విధంగా అభినందించారో అదేవిధంగా 'బైసన్' మూవీని చూసి తలైవర్ ప్రశంసించారని మారి సెల్వరాజ్ పేర్కొన్నారు.



రజనీకాంత్‌తో మారి సెల్వరాజ్



మందవెల్లి రోడ్డులో మోకాలిలోతు నీటిలో వెళుతున్న వాహనాలు

భారీ వర్షాలు.. ప్రజలకు అవస్థలు

ఆంధ్రజ్యోతి, చెన్నై

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం, ఈశాన్యరుతుపవనాల ప్రభావం కారణంగా దక్షిణాది జిల్లాల్లో గత మూడు రోజులుగా భారీవర్షాలు కురిసాయి. నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 11 గంటల నుండి భారీగా వర్షం కురిసింది. చెన్నైలోని మణి, ఎన్నూరు, నెర్కుండ్రం, వలసరవాక్కం, అంబత్తూరు, నుంగంబాక్కం, అమింజికరై, తురైపాక్కం, కొరట్టూరు, విమ్కోనగర్, ఈంజంబాక్కం, కోయంబేడు, మధురవాయల్, పూందమల్లి, తాంబరం, వేళచ్చేరి, రాయపేట, ట్రిప్లికేన్, ప్యారీస్ కార్నర్, అడయార్ తదితర ప్రాంతాల్లో వేకువజాము 3 నుండి 5 గంటల వరకూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. స్థానిక వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం బుధవారం ఉదయం 8 గంటల వరకు 24 గంటల వ్యవధిలో ఎన్నూరులో 12 సెం.మీ., మధురవాయల్, నెర్కుండ్రం ప్రాంతాల్లో 11 సెం.మీ., ఉత్తర చెన్నైలో 10 సెం.మీ., వలసరవాక్కం, మనలిలో 9 సెం.మీలు, వడపళని, అంబత్తూరు, నుంగంబాక్కం, అమింజికరై, దురైప్పాం, కొరట్టూరులో 8 సెంమీ, ఈంజంబాక్కంలో 7 సెం.మీల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు కోడంబాక్కం, మైలాపూరు ప్రాంతాల్లో పలు చోట్ల చెట్లు కూలిపడ్డాయి. పల్లపు ప్రాంతాలు వర్షపునీరు చేరడంతో దీవులుగా మారాయి. కోడంబాక్కం ట్రస్టుపురం ఐదవ క్రాస్ స్ట్రీట్‌లో భారీ వృక్షం కూలి విద్యుత్ తీగెలపై పడింది. మైలాపూరు రాధాకృష్ణన్ రోడ్డులో ఓ చెట్టు కూలిపడింది. ఇదే విధంగా మధురవాయల్ చిన్న నోలంబూరు, పూందమల్లి తదితర ప్రాంతంలోనూ కొన్ని చెట్లు కూలిపడ్డాయి. అగ్నిమాపక దళం, కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ఆ చెట్లను తొలగించారు.



అన్నాసాలై వద్ద స్కూటర్‌పై గొడుగు వేసుకుని వెళ్తున్న మహిళలు



మైలాడుదురై సమీపంలోని కంజానగరం వద్ద మునిగిన పంటపొలాలు



పట్టినంబాక్కంలో తీరానికే పరిమితమైన చేపలబోట్లు

కేంద్ర మంత్రి అమిత్ షాకు ఈపీఎస్ జన్మదిన శుభాకాంక్షలు

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా జన్మదినం సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి బర్త్‌డే విషెస్ చెప్పారు. ఈ మేరకు ఆయన తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. దేశ రక్షణ, సమైక్యతను కాపాడటంతో మీ ఎనలేని కృషి, సమర్థవంతమైన నాయకత్వం, త్యాగం అభినందనీయం. దేశ సేవ కోసం మీరు ఆయురారోగ్యాలతో వరుస విజయాలు సాధిస్తుండాలని ఆశీర్వదిస్తున్నాను' అని పేర్కొన్నారు.



స్కందషష్ఠిని పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

వ్రత మాచరించి అంగ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తిరుచెందూరులో నేత్రపర్వంగా స్కందషష్ఠి ఉత్సవాలు ప్రారంభం

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రమైన తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో స్కందషష్ఠి వేడుకలు బుధవారం ఉదయం యాగశాల పూజలతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేలాదిమంది భక్తులు సముద్రస్నానమాచరించి, నాళికినరు వద్ద పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానంతరం స్కందషష్ఠి వ్రతాన్ని ప్రారంభించారు. భక్త బృందాలు స్కందషష్ఠి కవచాన్ని గానం చేశారు. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయాన్ని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటిగంటకే తెరిచారు. 1.30 గంటలకు విశ్వరూప దీపారాధన, 2 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం నిర్వహించారు. బుధవారం వేకువజాము 5.30 గంటలకు తులాలగ్నంలో స్వామి జయంద్రేనాధుడు యాగశాలలో కొలువుదీరారు. ఉదయం ఏడు గంటలకు యాగశాల పూజతో స్కందషష్ఠి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు యాగశాలలో పూజారులు దీపారాధన నిర్వహించారు. అనంతరం స్వామి జయంద్రేనాథుడు వళ్ళి - దైవానై సమేతుడై స్వర్ణసప్పరంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. షణ్ముఖవిలాస మండపానికి చేరుకున్న తర్వాత అర్చకులు మహాదీపారాధన చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మూలవర్లకు సంధ్యా దీపారాధన అనంతరం స్వామి జయేంద్రనాథుడు ఇష్ట దేవేరుల సమేతంగా తిరువాడుదురై ఆధీన షష్ఠి మండపంలో వేంచేశారు. స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, అలంకారం నిర్వహించిన మీదట స్వర్ణరథంలో గిరి వీధులలో ఊరేగి అంతర ప్రాకారానికి చేరుకున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శూరసంహారవైభవం ఈ నెల 27 సాయంత్రం సముద్ర తీరంలో నిర్వహించనున్నారు. సముద్రతీరంలోని సంతోషమండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం చేసి మహాదీపారాధన నిర్వహించాక గిరి ప్రకారం మీదుగా ఆలయ అంతర ప్రాకారానికి తీసుకువస్తారు. 28 రాత్రి 11 గంటలకు 'కుమరవిడంగ పెరుమాన్‌కు, దైవానైదేవికి తిరుకళ్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ట్రస్టీ అరుళ్‌మురుగన్, డిప్యూటీ కమిషనర్ రాము, ఆలయ సిబ్బంది తగు సదుపాయాలు కల్పిస్తున్నారు.

స్వామిమలైలో....

తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని స్వామిమలైలో బుధవారం తెల్లవారుజామున స్కంధషష్ఠి ఉత్సవాలు ప్రారంభం కాగా, వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. షణ్ముఖస్వామి, విఘ్నేశ్వరుడు, పరివార దేవతలతో కొండపైనున్న ఆలయం నుంచి మెట్ల మార్గం ద్వారా ఉత్సవ మండపానికి వేంచేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకారం, మహా దీపారాధనతో ప్రారంభమైన ఈ వేడుకలు ఈ నెల 28వ తేది వరకు కొనసాగనున్నాయి.

సిరువాపురిలో...

తిరువళ్లూరు జిల్లా చోళవరం తాలూకా చిన్నంబేడు అని పిలిచే సిరువాపురిలో సుప్రసిద్ధ బాలసుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో బుధవారం ఉదయం స్కందషష్ఠి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆలయంలో విఘ్నేశ్వరపూజ, వాస్తు శాంతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం ధ్వజారోహణం జరిపిన మీదట స్వామివారిని ప్రధాన వీధులలో ఊరేగించారు. సాయంత్రం యాగశాల పూజలు, రక్షాబంధనం, స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 27న శూరసంహారం జరుపుతారు. ఈ ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఆలయ కార్యనిర్వహణాధికారి మాధవన్, ఆలయ ఉద్యోగులు సిబ్బంది తగు సదుపాయాలు కల్పిస్తున్నారు.

తిరుప్పరంకుండ్రంలో..

మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం క్షేత్రంలోనూ స్కంధ షష్ఠి ఉత్సవాలు అభిషేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో కంకణధారణ చేసిన భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ స్వామివారు తన ఇష్టదేవేరులతో వివిధ వాహనాలలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు.



ఆలయంలో యాగశాల పూజలు నిర్వహిస్తున్న పూజారులు





తిరుప్పరంకుండ్రంలో స్వామి, అమ్మవార్లను అలంకరిస్తున్న పూజారులు - ఆలయం వద్ద భక్తులకు కంకణ ధారణ చేస్తున్న ప్రధాన పూజారి



సిరువాపురిలో స్కందషష్ఠి ఉత్సవాలకు ధ్వజారోహణం చేస్తున్న పూజారులు, ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నిండుకుండలా సాత్తనూరు డ్యాం

● తెన్ పెన్నై తీరవాసులకు వరద హెచ్చరిక

చెన్నై, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా తండరాంబట్టు సమీపంలోని సాత్తనూరు డ్యాం నుండి అదనపు జలాలను విడుదల చేస్తుండటంతో తెన్‌పెన్నై తీరంలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. 119 అడుగుల ఎత్తున్న ఈ డ్యామ్‌లో 7,361 మిలియన్ల ఘనపుటడుగుల నీటిని నిల్వ చేయడానికి వీలుంది. ఆ డ్యామ్ కుడి, ఎడమ కాలువల ద్వారా తిరువణ్ణామలై, విల్లుపురం, వేలూరు, కళ్లకురిచ్చి, కడలూరు జిల్లాలో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. ప్రస్తుతం ఈశాన్యరుతుపవనాల ప్రభావంతో పాటు బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా డ్యాంపరివాహక ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా భారీగా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం పెరగటంతో బుధవారం ఉదయం ఆ డ్యామ్ నుండి సెకనుకు 5 వేల ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేశారు. ఈ జలాలు ప్రస్తుతం తెన్‌పెన్నై నదిలోకి చేరనుండటంతో ఆ నదీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి నీటివనరుల శాఖ అధికారులు వరద హెచ్చరిక చేశారు. అక్కడున్న వారంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలని ఆదేశించారు.



సాత్తనూరు డ్యాం నుండి విడుదల చేస్తున్న నీరు

వివాహం కాలేదని ఆత్మహత్య

● గరుడ వారధి నుంచి దూకిన మదురై యువకుడు



మృతిచెందిన రాజన్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వివాహం కాలేదనే మనోవేదనతో బుధవారం ఉదయం తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి దూకి మదురైకి చెందిన పాండియ రాజన్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. రాజన్ తన కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతికి చేరుకున్న ఇతడు రైల్వేస్టేషన్‌లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపాడు. తాను బస్సులో వస్తానని చెప్పి వారిని పంపించాడు. అనంతరం కపిలతీర్థం సర్కిల్‌కు చేరుకుని గరుడ వారధిపై నుంచి నడుచుకుంటూ ప్రకాశం మున్సిపల్ పార్కు వద్దకు వచ్చి దూకేశాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు 112కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద ఉన్న మొబైల్ నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరడం లేదని కొన్ని రోజులుగా అతడు బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానేంద్రనాథ్ రాయ్, మాజీ మంత్రి ఆర్కే రోజా, నటి రవళి, ప్రభుత్వ సలహాదారుడు ఆర్పీ ఠాకూర్ ఉన్నారు.

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,343

తలనీలాలు సమర్పించినవారు: 18,768







నారాయణవనం, పుత్తూరు మండలాల్లో కైలాసకోన, మూలకోన జలపాతాల జోరు



కోట: గూడలి వద్ద పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి

ముంచెత్తిన వాన

మండలం	వర్షపాతం (మిమీలలో)
శ్రీకాళహస్తి	184.6
తొట్టంబేడు	176.8
బీఎన్ కండ్రిగ	149.4
పెళ్లకూరు	144.2
దొరవారిసత్రం	143.8
వడమాలపేట	141.8
సూళ్ళూరుపేట	135.6
ఏర్పేడు	132.8
వెంకటగిరి	126.6
డక్కిలి	124.2
బాలాయపల్లి	112.4
తిరుపతి రూరల్	108.8
గూడూరు	107.2
వరదయ్యపాలెం	103.2
రేణిగుంట	100.6
తిరుపతి అర్బన్	98.4
ఓజిలి	98.2
తడ	97.8
చిల్లకూరు	94.2
రామచంద్రాపురం	88.2
చంద్రగిరి	84.6
కేవీబీపురం	82.2
నాయుడుపేట	80.4
పాకాల	79
సత్యవేడు	78
ఎర్రావారిపాలెం	64
నారాయణవనం	60.4
చిట్టమూరు	58.8
పిచ్చాటూరు	56.6
పుత్తూరు	51.2
నాగలాపురం	48.6
వాకాడు	42.4
కోట	41.4
చిన్నగొట్టిగల్లు	31.6

గరిష్ఠ వర్షపాతం: శ్రీకాళహస్తిలో 18.4 సెంటీమీటర్లు, **కనిష్ఠం:** చిన్నగొట్టిగల్లులో 3.1 సెంమీ, **15 మండలాలు:** 10 సెంమీకుపైగా వర్షం, **జిల్లా సగటు:** 97.9 మిల్లీమీటర్ల వర్షపాతం

● వాగులు, వంకలు, జలపాతాల ఉధృతి

● పలు మార్గాల్లో రాకపోకలు బంద్

భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. మంగళవారం లాగే బుధవారమూ వానలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు, జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదుల్లోనూ ప్రవాహం మొదలైంది. పలు చోట్ల చెరువుల్లోకి నీరు చేరుతోంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లావ్యాప్తంగా 19 మార్గాల్లో 44 ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. స్వర్ణముఖి ఉధృతి కారణంగా గుడిమల్లం ఆలయానికి వర్షాలు తగ్గేవరకూ రావద్దంటూ అధికారులు భక్తులను కోరారు. తిరుపతిలోని కపిలతీర్థం, నారాయణవనం మండలం కైలాసకోన, పుత్తూరు మండలం మూలకోన తదితర జలపాతాలు జోరుగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల పంట పొలాలు నీటమునిగాయి. తూపిలిపాలెం సముద్రతీరం పరిశీలించిన రెవెన్యూ అధికారులు వేటకు వెళ్లొద్దంటూ మత్స్యకారులకు సూచించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

ఈ దారిన రావొద్దు



గూడూరు: పంబలేరు చప్టాపై ఆగిన రాకపోకలు

● బాలాయపల్లి మండలం నిండలి వద్ద కైవల్యానది బ్రిడ్జి పైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

● చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం వద్ద ఉప్పుటేరు కాజ్‌వేపై ఉధృత ప్రవాహంతో వాహనాల రాకపోకలు ఆగాయి.

● గూడూరు పంబలేరు వంతెన వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరింది. వాహనాల రాకపోకలను ఆపేసి, పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.

● రేణిగుంట మండలం కల్లూరు వంక ఉధృతితో రాకపోకలు ఆగాయి. అత్తూరు మార్గంలో వాగు పొంగడంతో పోలీసులు రాకపోకలు నిలిపేశారు. రేణిగుంట- అన్నాసామిపల్లె మార్గంలో వాగు ఉధృతి కారణంగా రాకపోకలు ఆపేశారు.

● ఏర్పేడు మండలం మోదుగులపాలెం- కొత్తవీరాపురం మార్గంలో స్వర్ణముఖి నది బ్రిడ్జిపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసు కాపలా ఉంటున్నారు.

● చావాలింగమనాయుడుపల్లి పంచాయతీలో పాముల కాలువ ఉధృతికి సంతవేలూరు- వరదయ్యపాలెం మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

● కేవీబీపురం మండలం కోవనూరు వద్ద వాగు ప్రవాహం రోడ్డుపైకి రావడంతో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

● నాగలాపురం మండలం నందనం గ్రామానికి రాకపోకలు నిలిచాయి.

● వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిపివేసి పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.

● తిరుపతి అర్బన్ మంగళం- శెట్టిపల్లె రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



ఏర్పేడు: మోదుగుపాళెం వద్ద స్వర్ణముఖి ఉధృత ప్రవాహం



వరదయ్యపాళెం: గోవర్ధనపురం వంతెనపై పోలీసు భద్రత







దొరవారిసత్రం: వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెనపై వరద సూళ్లూరుపేట: చెంగాళమ్మ ఆలయం వద్ద కాళంగి నది ఉధృత ప్రవాహం రామచంద్రాపురం: రాయలచెరువుకు నీటికళ

రోడ్డెక్కిన ప్రవాహం

● చిల్లకూరు మండలం వరగలి క్రాస్ వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ స్తంభించింది. ● సూళ్లూరుపేట- కోట పోలూరు మార్గంలో పుచ్చ కాలువ ఉధృతి పెరగడంతో రోడ్డుపైకి నీరు చేరింది. ● సూళ్లూరుపేట మండలం ఇలుపూరు- మంగళంపాడు రోడ్డులో దొండకాలువ పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది.



చిల్లకూరు: వరగలి క్రాస్‌రోడ్డు సమీపాన జాతీయ రహదారిపై ఆగిన వాహనాలు

వాగులు, వంకల ఉధృతి

● డక్కిలి మండలం వెలిగొండ కొండల్లో నుంచీ వచ్చే వాగులన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. కొండేరు వాగు ఉధృతంగా పారుతోంది.

● వెంకటగిరి మండలంలో గుడ్డేరు వాగు, బాలాయపల్లెలో కైవల్యానది జోరుగా ప్రవహిస్తున్నాయి.

● ఏర్పేడు మండలం గుడిమల్లంలోని సీతకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నాయుడుపేట, కోట, శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి ప్రవహిస్తోంది.



బాలాయపల్లె: నిండలి వద్ద కైవల్యా నది ప్రవాహం

చెరువును తలపిస్తూ..

● రేణిగుంట మండలం అడుసుపాలెం జగనన్న కాలనీ నీట మునిగి చెరువును తలపిస్తోంది. పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. జీపాలెం పంచాయతీ పద్మానగర్ లే అవుట్ నీట మునిగింది. పాంచాలినగర్, భగత్ సింగ్, నేతాజీ కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

● ఏర్పేడు మండలం ఇసుక తాగేలి పంచాయతీ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరడంతో బ్లీచింగ్ పౌడర్, సున్నం బస్తాలు నీటిపాలయ్యాయి. ప్రాథమిక పాఠశాలలోకీ నీళ్లు చేరాయి.

● తిరుచానూరు పంచాయతీ కార్యాలయం వద్దా నీళ్లు చేరాయి.

దెబ్బతిన్న రోడ్లు, చెరువు కట్టలు

● రేణిగుంట మండలం తూకివాకం రైల్వే వంతెన వద్ద నిర్మాణంలోని రోడ్డు వర్షాలకు దెబ్బతింది. రైలింగ్‌తో పాటు మట్టి కూడా దిగువకు జారిపోతోంది.

● ఏర్పేడు మండలం జంగాలపల్లి చెరువుకు నీటి ఉధృతితో రింగ్ బండ్ కొట్టుకుపోయింది. నీళ్లు వృథాగా పోతున్నాయి.

● కేవీబీపురం మండలంలో కాళంగి నది ఉధృతికి పూడి గ్రామాలకు వెళ్ళే మట్టి రోడ్డు కొట్టుకుపోయింది.

సందర్శకులూ ఇటు రావొద్దు

పుత్తూరు మండలం మూలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎకో టూరిజం చెక్ పోస్టు మూసివేసి సందర్శకుల రాకపోకలు నిలిపేశారు.

నీటమునిగిన అండర్ బ్రిడ్జిలు

తిరుపతిలో వెస్ట్ చర్చి వద్ద, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు నీట మునిగాయి. నగరంలోని గొల్లవానిగుంట, సుభాష్ నగర్, అశోక్ నగర్, లీలామహల్ కూడలి, మహిళా వర్సిటీ కూడలి, వైకుంఠపురం కూడలి, ఎమ్మార్‌పల్లి సర్కిల్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

17 పశువుల మృతి.. దెబ్బతిన్న పంటలు

శ్రీకాళహస్తిలో ఒక పక్కా ఇల్లు కూలగా, మరొకటి పాక్షికంగా దెబ్బతింది. బీఎన్ కండ్రిగలో నాలుగు గుడిసెలు కూలిపోయాయి. ఓజిలి మండలంలో రెండు గేదెలు, బీఎన్ కండ్రిగలో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తొట్టంబేడు మండలంలో రెండు ఎకరాల్లో కాకర పంట దెబ్బతినగా నష్టం రూ.60 వేలుగా అంచనా వేశారు.



వరదయ్యపాళెం: అంబూరు వద్ద నీట మునిగిన వరిపంట








చెరువులా లక్ష్మీపురం సర్కిల్

తిరుపతిలోని డీఆర్‌మహల్ వద్ద వర్షపునీటితో రైల్వే అండర్ బ్రిడ్జి నిండటంతో బ్యారికేడ్లు పెట్టిన అధికారులు

కల్యాణి డ్యామ్‌కు జలకళ

చంద్రగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కల్యాణి డ్యామ్‌లో నీటిమట్టం రెండు రోజుల ముందు 836 అడుగులు ఉండగా.. బుధవారం రాత్రికి 851 అడుగులకు చేరింది. రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోంది. మరోవైపు స్వర్ణముఖి నదీ ప్రవాహంతో రవణప్పగారిపల్లె వద్ద వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇక, రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్ పూర్తిగా నిండగా.. అరణియార్, కాళంగి రిజర్వాయర్లలోకి నీరు చేరుతోంది. ● వాకాడు మండలంలో స్వర్ణముఖి బ్యారేజీకి ఎగువ నుంచి మూడు వేల క్యూసెక్కులు వస్తుండగా.. 2500 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. మరో 500 క్యూసెక్కుల నీటిని చెరువులకు విడిచిపెడుతున్నారు.



కల్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీరు

19 మార్గాల్లో బస్సులకు అంతరాయం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్ష ఉధృతి నేపథ్యంలో 19రూట్లలో బుధవారం 44 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపేశారు. కొన్ని డిపోలకు పరిమితం కాగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. తిరుమల ఘాట్‌లో యథావిధిగా రాకపోకలు సాగించాయి. సీతమ్మకాలువ, కోవనూరుకాలువ, కలవూరు ఏటికాలువ, పున్నేపల్లి, గోవర్ధనపురం, పాపవినాశనం, తాటిమాకులకండ్రిగ, టన్నెల్లి, కురుగొండ, మనమాల, సీఎస్ పల్లి, ఆళత్తూరు, నెన్నూరు, చిన్నబిడికి, బలిరెడ్డిబ్రిడ్జి, కుమ్మరపాళెం, శ్రీనివాసపురం, ఇన్నతోట మార్గాల్లో బస్సు సర్వీసులు ఆగాయి.

● కరూర్ తొక్కిసలాట ఘటన.....

జస్టిస్ అజయ్ రస్తోగి కమిటీలో ఇద్దరు ఏడీజీపీలు




సుమీత్ చరణ్



సోనల్ వి.మిశ్రా

అడయార్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే నేత విజయ్ జరిపిన రోడ్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందిన సంఘటనపై సీబీఐ దర్యాప్తు పర్యవేక్షించనున్న జస్టిస్ అజయ్ రస్తోగి కమిటీలో ఇద్దరు ఏడీజీపీలు సభ్యులుగా నియమితులయ్యారు. కరూర్ దుర్ఘటనపై విచారణ జరిపేందుకు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి సెందిల్‌కుమార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ టీవీకే నేతలు సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్ళారు. అదే సమయంలో కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ రాష్ట్ర బీజేపీ తరపున పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. సీబీఐ విచారణ తీరు పరిశీలించేందుకు సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి కమిటీ కూడా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆ కమిటీకి తమిళనాడు కేడర్‌కు చెందిన, ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న డీజీపీ స్థాయి కలిగిన ఇద్దరు అధికారులను సభ్యులుగా నియమించుకోవాలని కూడా ఆదేశించింది. తమిళనాడు క్యాడర్‌కు చెందిన ప్రస్తుతం బీహార్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో పని చేస్తున్న అడిషనల్ డీజీపీలు సుమీత్ చరణ్, సోనాల్ వి. మిశ్రా జస్టిస్ అజయ్ రస్తోగి కమిటీ సభ్యులుగా బుధవారం నియమితులయ్యారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సుమీత్ చరణ్ ప్రస్తుతం బీఎస్ఎఫ్ లో విధులు నిర్వహిస్తున్నారు. 1997లో పోలీస్ విధుల్లో చేరిన సుమీత్...కోవై నగర పోలీస్ కమిషనర్‌గా సేవలందించి, తర్వాత ఆయన కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. అలాగే 2000లో ఐపీఎస్ కేడర్ సోనల్ వి.మిశ్రా ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉంటూ సీఆర్‌పీఎఫ్ ఏడీజీపీగా సేవలందిస్తున్నారు. విధి నిర్వహణలో నిజాయితీకి మారుపేరుగా నిలిచిన ఈ ఇద్దరు ఏడీజీపీలు జస్టిస్ అజయ్ రస్తోగి కరూర్‌లో జరుపనున్న ప్రత్యక్ష విచారణలో పాలుపంచుకోనున్నారు. ఈ ఇరువురి నియామకంతో కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణ శరవేగంగా సాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

21 అడుగులకు చేరిన చెంబరంబాక్కం



పెరంబూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నగరానికి తాగునీరందించే జలాశయాల్లో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. చెంబరంబాక్కం జలాశయం పూర్తి సామర్థ్యం 24 అడుగులు కాగా, ప్రస్తుతం 21 అడుగులకు చేరింది. బుధవారం గణాంకాల ప్రకారం, జలాశయానికి 2,170 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. మరింతగా వర్షపాతం నమోదయ్యే అవకాశమండడంతో జలాశయం భద్రత దృష్ట్యా బుధవారం ఉదయం 500 ఘనపుటడుగుల జలాలు దిగువకు విడుదల చేశారు. ఈ జలాలు వెళ్లే కాలువల పరిసరాల్లోని సిరుగళత్తూర్, కావనూరు, కుండ్రత్తూర్, తిరుముడివాక్కం, వలుతలంబేడు, తిరునీర్‌మలై, అడయార్ నదికి ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీచేశారు. చెంబరంబాక్కం జలాశయం జల కళ సంతరించుకుని సముద్రాన్ని తలపిస్తుండడంతో, వీక్షించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. దీంతో జలాశయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఇదే విధంగా పూండి జలాశయం పూర్తి సామర్థ్యం 35 అడుగులు కాగా, ప్రస్తుతం 33 అడుగులకు చేరింది. డ్యాం భద్రత దృష్ట్యా కుశస్థలి నదిలోకి విడుదల చేస్తున్న నీటిని బుధవారం ఐదువేల ఘనపుటడుగులకు పెంచారు. ఈ కారణంగా కుశస్థలి నదీతీరంలోని లోతట్టు ప్రాంతాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు.